క్లుప్తంగా

హోరెత్తిన ఎన్నికల ప్రచారం



ఎస్.చామవరంలో ప్రచారం చేస్తున్న దొరబాబు

తుని రూరల్: వర్షం కారణంగా మంగళవారం ప్రధాన నాయకుల ప్రచారాలు వాయిదా పడ్డాయి. ఎస్.చామవరంలో తాండవషుగర్స్ మాజీ చైర్మన్ నాగం దొరబాబు, వి.కొత్తూరులో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు దుంగల నాగేశ్వరరావు, మాజీ అధ్యక్షుడు పోతల రమణ, తేటగుంటలో ఆత్మ చైర్మన్ చోద్రాజు రాంబాబురాజు ఆధ్వర్యంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఇతర నేతలు ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే అభ్యర్థి దాడిశెట్టి రాజా, ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్‌ను గెలిపించాలని కోరారు.
కోటనందూరు: కాకరాపల్లిలో ఉపాధి కూలీలకు ఏఎంసీ జిల్లా చైర్మన్ లంక ప్రసాద్ మజ్జిగ ప్యాకెట్లు అందజేశారు. తుని ఎమ్మెల్యేగా దాడిశెట్టి రాజాను, కాకినాడ ఎంపీగా చలమలశెట్టి సునీల్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

పోస్టల్ బ్యాలెట్‌లో 89 మంది ఓటింగ్

ప్రత్తిపాడు: పోస్టల్ బ్యాలెట్‌కు ప్రత్తిపాడు మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్‌లో మంగళవారం 89 మంది ఉద్యోగులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఏలేశ్వరం మండలంలో 24 మంది, ప్రత్తిపాడులో 27, రౌతులపూడిలో 18, శంఖవరంలో 20 మంది ఓటు హక్కు వినియోగించుకున్నట్టు ఏఆర్‌ఓ సీహెచ్ విద్యాపతి తెలిపారు.

నేడు చండీహోమం

అన్నవరం: కనకదుర్గ అమ్మవారి చైత్రమాస జాతర మహోత్సవాలు బుధవారం ఉదయం నిర్వహించనున్న చండీహోమంతో ముగియనున్నాయి. ఈ ఉత్సవాలు గత నెల 29న ప్రారంభమయ్యాయి. మంగళవారం లక్ష కుంకుమార్చన పూజల్లో వేద పండితుడు సంతోష్ ఘనపాఠీ, ఆలయ అర్చకుడు కంచిభట్ల సాయిరామ్, వ్రత పురోహితులు పాల్గొన్నారు. బుధవారం ఉదయం 8 గంటలకు చండీహోమం ప్రారంభించగా, పూర్ణాహుతితో కార్యక్రమం ముగుస్తుంది.

సీహెచ్‌సీలో తల్లికి వందనం

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు సీహెచ్‌సీలో మంగళవారం తల్లికి వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. సీహెచ్‌సీ సూపరింటెండెంట్ సౌమ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తుని నాసా సంస్థ ప్రతినిధి ప్రేమజ్యోతి హాజరయ్యారు. సుమారు 300 మంది గర్భిణులకు, స్థానిక సబ్ జైలులోని ఖైదీలకు నాసా ప్రతినిధి ప్రేమజ్యోతి మజ్జిగ పంపిణీ చేశారు.

ఆదర్శప్రాయుడు అల్లూరి

ఏలేశ్వరం: బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి పట్టణంలో, భద్రవరంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. సీపీఎం, సీఐటీయూ నాయకులు పాకలపాటి సోమరాజు, పిల్లా రాంబాబు ఆధ్వర్యంలో అల్లూరి విగ్రహానికి నివాళులర్పించారు. సీపీఐ (ఎంఎల్) వినోద్ మిశ్రా పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కొసిరెడ్డి గణేష్ ఆధ్వర్యంలో లింగంపర్తి, పరిమితడక గ్రామాల్లో అల్లూరి వర్ధంతి నిర్వహించారు.
ప్రత్తిపాడు: అల్లూరి వర్ధంతి సందర్భంగా స్థానిక అల్లూరి సీతారామరాజు జంక్షన్‌లోని అల్లూరి విగ్రహానికి సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి ఏగుపాటి అర్జునరావు నివాళులర్పించారు. బ్రిటిష్ సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా పోరాడిన యోధుడని కొనియాడారు.
కిర్లంపూడి: విప్లవ యోధుడు అల్లూరి సీతారామరాజు పోరాట స్ఫూర్తితో యువత ముందుకు సాగాలని ఏపీఆర్‌సీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు అన్నారు. అల్లూరి సీతారామరాజు శత వర్ధంతి సందర్భంగా మంగళవారం బూరుగుపూడిలోని అల్లూరి విగ్రహానికి పూలమాల వేసి, ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో అల్లూరి చేసిన కృషి, త్యాగం నేటి యువతరం ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కడితి సతీష్, నాయకులు సురేష్, కర్రి కిట్టయ్య, బుర్ర రాఘవ, దాస పెదఅబ్బులు, వీరబాబు, సూరిబాబు ఉన్నారు.
కోటనందూరు: అల్లూరి శత వర్ధంతిని స్థానిక శివదుర్గ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. అల్లూరి చిత్రపటానికి నివాళులర్పించారు. తుని మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ వెలగా వెంకటకృష్ణాజీ, శివరామకృష్ణ పాల్గొన్నారు.

కుండపోత వాన

- చల్లబడిన వాతావరణం
- ఉపశమనం పొందిన ప్రజలు
- వ్యవసాయ పనులకు ఆటంకం



తొండంగి మండలం గోపాలపట్నంలో కురుస్తున్న కుండపోత వర్షం

తొండంగి: వేసవి ఎండల తీవ్రతతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు మంగళవారం కురిసిన కుండపోత వర్షం ఉపశమనం కలిగించింది. కొద్ది రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు పైగా ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తన ద్రోణి కారణంగా ఆకాశం మేఘావృతమై మంగళవారం మధ్యాహ్నం దాదాపుగా రెండు గంటల పాటు కుండపోత వర్షం కురిసింది. వాతావరణం చల్లబడటంతో ప్రజలంతా ఉపశమనం పొందారు. వర్షం కారణంగా పల్లపు ప్రాంతాలన్నీ రోడ్లు, డ్రైన్లు జలమయమయ్యాయి. మరో రెండు రోజుల పాటు వాతావరణం చల్లగా ఉంటుందని, వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ ప్రకటించింది.

పంట ఒబ్బిడికి ఆటంకం

మండలంలో మంగళవారం కురిసిన అకాల వర్షానికి వ్యవసాయపరంగా పంట ఒబ్బిడి పనులకు ఆటంకం కలిగింది. రబీ పంటకాలం పూర్తి కావడంతో కొద్ది రోజులుగా ఖరీఫ్‌లో నిల్వ ఉంచిన వరికుప్పల నూర్పిడి పనులు చేస్తున్నారు. రబీ వరిపంట కోత పనులు తొంభై శాతం పూర్తికావడంతో, తొండంగి, శృంగవృక్షం, కోదాడ, కొత్తపల్లి తదితర ప్రాంతాల్లో అక్కడక్కడా పంటలు కోత కోయాల్సి ఉంది. కాగా అకాల వర్షం కారణంగా పంట నూర్పిడి చేస్తుండగా, కల్లాల్లో ధాన్యం తడవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈదురు గాలులకు మామిడి తోటల్లో కాయలు నేలరాలాయి. కాయలు కోతకొచ్చి, అమ్ముకునే తరుణంలో అకాల వర్షం తమకు తీవ్రనష్టం కలిగించిందని మామిడి రైతులు వాపోయారు. జీడి మామిడి, అరటి తోటలకు కూడా స్వల్పంగా నష్టం వాటిల్లింది.

ద్రోణి ప్రభావంతో మోస్తరు వర్షం

తుని రూరల్: ద్రోణి ప్రభావంతో మండలంలో ఓ మోస్తరు వర్షం కురిసింది. మంగళవారం ఉదయం 11 గంటల నుంచి 12.30 వరకు, ఆ తర్వాత రెండు గంటల నుంచి సాయంత్రం వరకు వర్షపు జల్లులు కురుస్తూనే ఉన్నాయి. నెల రోజులుగా అధిక ఉష్ణోగ్రతలతో అల్లాడుతున్న ప్రజలకు ఈ వర్షం ఊరటనిచ్చింది. వాతావరణ శాఖ అధికారులు ప్రకటించినట్టుగా మూడు రోజుల పాటు ఇలాగే తేలికపాటి వర్షాలు కురిసే సూచనలు కనిపిస్తున్నాయి.
ప్రత్తిపాడు: ఉదయం ఉగ్రరూపం దాల్చిన సూర్యుడు.. ద్రోణి ప్రభావంతో 11 గంటల నుంచి సాయంత్రం వరకు మండలంలో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు పడ్డాయి. పల్లపు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచింది. వాతావరణం ఆహ్లాదకరంగా మారడంతో రోడ్లపై జన సంచారం పెరిగింది.

వైభవంగా తలుపులమ్మ జాగరణ మహోత్సవం



కేరళ కళాకారుల వాయిద్య ప్రదర్శన

తుని రూరల్: తలుపులమ్మ అమ్మవారి పుట్టింటి సంబరాలైన గంధమావాస్య జాగరణ మహోత్సవాలు వైభవంగా జరిగాయి. మంగళవారం రాత్రి తుని మండలం లోవకొత్తూరులో లోవ దేవస్థానం ఆధ్వర్యంలో జాగరణ ఉత్సవాలను డిప్యూటీ కమిషనర్, ఈఓ పెన్మెత్స విశ్వనాథరాజు ప్రారంభించారు. నక్కపల్లివారి బ్యాండ్ మేళం, శక్తి వేషాలు, గరగోత్సవం, కేరళ బటర్‌ఫ్లై డ్యాన్స్ తదితర ప్రదర్శనలు జరిగాయి. తాళ్లూరులో అమ్మవారి ఉత్సవాలు చేశారు. అమ్మవారిని బుధవారం లోవకొత్తూరులో ఊరేగిస్తామని, గరగల సంబరం, తీర్థం చేస్తామని ఈఓ తెలిపారు.

యువతకు పెద్ద ఎత్తున ఉపాధి, ఉద్యోగాలు

వైఎస్సార్ సీపీ కాకినాడ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్



ఎన్నికల ప్రచారంలో ప్రసంగిస్తున్న ఎంపీ అభ్యర్థి సునీల్

అన్నవరం: కాకినాడ జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లోని వేలాది మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్టు కాకినాడ పార్లమెంట్ వైఎస్సార్ సీపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్ తెలిపారు. మంగళవారం ఆయన రత్నగిరిపై సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. అనంతరం అన్నవరంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నాయీ బ్రాహ్మణ, రజక, మత్స్యకార, శెట్టిబలిజ తదితర బీసీ కులాల యువకులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో హెయిర్ డ్రెస్సింగ్ యూనిట్లు, బ్యూటీపార్లర్లు, సెలూన్లు, లాండ్రీలు, ఆధునిక పడవలు, కోల్డ్ స్టోరేజీల ఏర్పాటు తదితర వాటికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధుల మంజూరు, బ్యాంకు లోన్లు వచ్చేలా కృషి చేస్తానన్నారు. చిన్న తరహా, వ్యవసాయాధారిత పరిశ్రమల స్థాపనకు సహకరిస్తానని హామీ ఇచ్చారు. అన్నవరం సత్యదేవుని ఆలయం, పిఠాపురంలో కుక్కుటేశ్వర స్వామి, పాద వల్లభ దత్తాత్రేయ ఆలయం, తలుపులమ్మ తల్లి ఆలయం, సామర్లకోటలో కుమారా రామలింగేశ్వర ఆలయాలు అభివృద్ధి చెందేలా టెంపుల్ టూరిజంను పెంపొందిస్తానని తెలిపారు. ఇంజినీరింగ్, ఐటీఐ, పాలిటెక్నిక్ చదివిన యువతకు కాకినాడలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేసి, ఉపాధి కల్పిస్తానన్నారు. రూ.400 కోట్లతో కాకినాడ పార్లమెంట్ నియోజకవర్గంలో 400 గ్రామాలు దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తానని తెలిపారు. ఎంపీ అభ్యర్థిగా తనకు, ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావుకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. దేవస్థానంలో పని చేస్తున్న తమకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెల పారితోషికాన్ని రూ.20 వేలకు పెంచినందుకు ఈ ఎన్నికల్లో ఓటు వేసి రుణం తీర్చుకుంటామని నాయీ బ్రాహ్మణులు తెలిపారు. శంఖవరం ఎంపీపీ పర్వత రాజబాబు, సర్పంచ్ శెట్టిబత్తుల కుమార్‌రాజా, ఉప సర్పంచ్ బొబ్బిలి వెంకన్నబాబు, ఎంపీటీసీ దడాల సతీష్, నాయకులు సరమర్ల మధుబాబు, కొండపల్లి అప్పారావు, రాయి శ్రీనివాస్, ర్డు సభ్యులు సింగంపల్లి రాము, ఆశిన శ్రీనివాస్, యాళ్ల భాస్కరరావు, కొండి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీతో పేదలకు మేలు

ప్రత్తిపాడు అసెంబ్లీ అభ్యర్థి వరుపుల సుబ్బారావు



ఎ.మల్లవరంలో ప్రచారం నిర్వహిస్తున్న వరుపుల సుబ్బారావు

రౌతులపూడి: కులమత, వర్గ రాజకీయాలు చూడకుండా, అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి అండగా నిలవాలని ప్రత్తిపాడు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు అన్నారు. మంగళవారం ఎ.మల్లవరం, ఎస్.పైడిపాల గ్రామాల్లో ఆయన పార్టీ శ్రేణులతో కలసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ఐదేళ్లలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. భవిష్యత్తులో పేదలకు మరింత మేలు చేసేలా మేనిఫెస్టోను రూపొందించారని చెప్పారు. అన్ని సంక్షేమ పథకాలు అమలు కావాలంటే ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి, ప్రతి పేదవాడికి వైద్యం; అత్యాధునిక వసతులకు ఆస్పత్రుల అభివృద్ధి చేసినట్టు వివరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గొల్లు చినదివాణం, పార్టీ ముఖ్య నేత వాసిరెడ్డి జమీలు, మాజీ ఎమ్మెల్సీ అంగూరి లక్ష్మీశివకుమారి, డీసీసీబీ డైరెక్టర్ పులి మధు, సర్పంచ్ చిందాడ రాజు, ఎంపీటీసీ బొడ్డు రాజు, పార్టీ నాయకులు కాకి నాని, రాయి ప్రసాద్, కాకి చిట్టిబాబు, పోలుపర్తి తాతాజీ పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే ప్రజలకు మేలు : వెంకటలక్ష్మి

ఏలేశ్వరం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే ప్రజలకు మేలు చేకూరుతుందని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు భార్య వెంకటలక్ష్మి అన్నారు. లింగంపర్తి గ్రామంలో మంగళవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ అధికారం చేపడితే మహిళలకు బంగారు భవిష్యత్తు ఉంటుందన్నారు. మహిళలంతా వైఎస్సార్ సీపీకి అండగా నిలవాలన్నారు. పార్టీ నేత వరుపుల రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి ప్రదాతకు అండగా నిలవండి

ముద్రగడ పద్మనాభం తనయుడు గిరిబాబు



జగపతినగరంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ముద్రగడ గిరిబాబు

కిర్లంపూడి: అభివృద్ధి ప్రదాత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వచ్చే ఎన్నికల్లో అండగా నిలవాలని కాపు ఉద్యమ నేత, వైఎస్సార్ సీపీ నాయకుడు ముద్రగడ పద్మనాభం తనయుడు గిరిబాబు కోరారు. పార్టీ నేత పెంటకోట నాగబాబు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు గిరిబాబుతో కలిసి వందలాది బైక్‌లపై ముద్రగడ నివాసం నుంచి ర్యాలీగా మంగళవారం జగపతినగరానికి చేరుకున్నారు. అనంతరం ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గిరిబాబుకు అడుగడుగునా ప్రజలు బ్రహ్మరథం పట్టారు. సార్వత్రిక ఎన్నికల్లో రెండు ఓట్లను వైఎస్సార్ సీపీకి వేసి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేయాలని గిరిబాబు అభ్యర్థించారు. ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయితే ఈ ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఉపాధి కల్పనకు, ఆర్థికాభివృద్ధి కోసం వైఎస్సార్ సీపీని గెలిపించుకోవాలని కోరారు. కాకినాడ ఎంపీగా పోటీ చేస్తున్న చలమలశెట్టి సునీల్‌ను, జగ్గంపేట ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న తోట నరసింహంను అఖండ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట జగపతినగరం, కిర్లంపూడి, చిల్లంగి గ్రామాల నుంచి వచ్చిన ముద్రగడ అభిమానులు, పార్టీ నాయకులతో వీధులు కిక్కిరిశాయి.

నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తా

ఎంపీ అభ్యర్థి సునీల్‌తో కలిసి తోట నరసింహం ఎన్నికల ప్రచారం



రంపయర్రంపాలెంలో ప్రచారం చేస్తున్న తోట నరసింహం, చలమలశెట్టి సునీల్

గోకవరం: రెండుసార్లు ఎమ్మెల్యేగా సేవలందించిన తనకు మరోసారి అవకాశమిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని వైఎస్సార్ సీపీ జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం అన్నారు. ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్‌తో కలిసి ప్రచార రథంపై ఆయన ఠాకూరుపాలెం నుంచి గంగంపాలెం, రంపయర్రంపాలెం, పెంటపల్లి, వీరలంకపల్లి, బావాజీపేట మీదుగా వెదురుపాక వరకు రోడ్‌షో నిర్వహించారు. వారికి ప్రజలు బ్రహ్మరథం పట్టగా, మహిళలు హారతులిచ్చి, పూలమాలలతో సత్కరించారు. ఐదేళ్ల పాలనలో సంక్షేమ పథకాలతో లబ్ధి పొందామని, తామంతా వైఎస్సార్ సీపీకే మద్దతుగా ఉంటామని ఓటర్లు తెలిపారు. ఠాకూరుపాలెంలో సుమారు 20 కుటుంబాల వారు పార్టీలోకి చేరారు. సునీల్, నరసింహం మాట్లాడుతూ టీడీపీ బూటకపు హామీలిచ్చి ప్రజలను మోసం చేయాలని చూస్తోందన్నారు. ప్రజలు విజ్ఞతతో ఆలోచించి, ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తమను ఎంపీ, ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. పార్టీ మండల కన్వీనర్ పాటి రాంబాబు, సొసైటీ చైర్మన్ దాసరి చినబాబు, ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్, జోనల్ ఇన్‌ఛార్జి గుల్లా ఏడుకొండలు, సీనియర్ నాయకులు సుంకర వీరబాబు, సమ్మెటి నాని, ముత్యాల శ్రీనివాస్, చింతలపూడి రమేష్‌బాబు, దొడ్డా విజయ్, దొడ్డి నాగేశ్వరరావు, కనిశెట్టి నాగేశు, కొల్లాటి రామకృష్ణ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీతోనే సంక్షేమం, అభివృద్ధి

కిర్లంపూడి: రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి వైఎస్సార్ సీపీతోనే సాధ్యమని పార్టీ జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం తనయుడు రాంజీ అన్నారు. వేలంకలో ఆయన ప్రచారం చేశారు. పార్టీ శ్రేణులతో కలసి ఇంటింటికీ వెళ్లి ఐదేళ్ల పాలనలో వైఎస్సార్ సీపీ ప్రజలకు చేసిన మంచిని వివరించారు. ఆయనకు మహిళలు హారతులు పట్టి ఆశీర్వదించారు. అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేసి, ప్రతి ఇంటికీ సంక్షేమ లబ్ధిని చేకూర్చినట్టు రాంజీ వివరించారు. ఎన్నికల్లో కాకినాడ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్‌కు, జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహంను అఖండ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. పార్టీ మండల ఇన్‌చార్జి తోట బాబ్జీ, నాయకులు జోకా శ్రీను, దోమాల గంగాధర్, అడబాల శ్రీను, నీలగిరి చిట్టిబాబు, బేతాల బాస్కరరావు, దోమల కృష్ణజడ్డి, దోమాల రాజా, చిట్నీడి శివ, శౌంతి నాగేశ్వరరావు పాల్గొన్నారు.